## రావిర్యాలలో ఇందిరమ్మ ఇళ్లు ఆకస్మిక తనిఖీ



రావిర్యాలలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ సెక్రటరీ గౌతమ్

బడంగ్ పేట్, జూన్ 13: ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హౌసింగ్ సెక్రటరీ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల వివరాలను ఆయన తెలుసుకుని, నిర్మాణ దశను పరిశీలించారు. పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు వచ్చే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, హౌసింగ్ బోర్డు డీఈ విక్య నాయక్, ఏఈ వెంకటేశ్వర్ రావు, ఆర్వో సామిక్ కుమార్, మల్లేష్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## చదువుతోనే బాలికల ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సత్యనారాయణ రాజు

సైదాబాద్, జూన్ 13: బాలికలు తమ ఉజ్వల జీవితాన్ని గొప్పగా తీర్చిదిద్దుకోవడానికి చదివే ఆయుధంగా మలుచుకోవాలని హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా వాలంటీర్ పి. సత్యనారాయణ రాజు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ (సంపాద బ)లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి బాల కార్మిక వ్యవస్థకు విద్యార్థులంతా దూరంగా ఉండి మంచిగా చదువుకోవాలన్నారు. బాలికలు స్నేహపూర్వక చట్టపరమైన, న్యాయ పరమైన అంశాల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల, హాస్టళ్లను మరింత సరళతరం చేసి, పిల్లలకు పని భారం తగ్గించడం, చదువుకునే సమయ వ్యవధిని విస్తరించడం, పాఠశాల హాస్టల్లలో సమయాన్ని పెంచడం ద్వారా బాల కార్మికులను తగ్గించగలదన్నారు. పిల్లలు జీవితాన్ని పాడు చేసుకోవడానికి బాల కార్మికులుగా మారకూడదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు భాగ్యవతి, జె. వసంతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం



చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, కార్పొరేటర్ చింతల అరుణ



గూడూరులో చిన్నారులకు చేయిస్తున్న శాంతిశ్రీ, సబిత

మన్సూరాబాద్, జూన్ 13: నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, కార్పొరేటర్ చింతల అరుణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులచేత అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల మోజులో పడి డబ్బులు వృథా చేసుకోకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, నాయకులు పంగా శ్యామ్, శ్రీకాంత్, పద్మా రెడ్డి, సరస్వతీ పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు, జూన్ 13 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మహేశ్వరం ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. మండల పరిధిలోని గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 'బడిబాట' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా 2025 –26 విద్యా సంవత్సరానికి గాను అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఆహ్వానించిన అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో జరుగుతున్న విద్యాబోధన విధానం, ప్రీస్కూల్ టైమ్ టేబుల్, సిలబస్, కార్నర్స్, అసెస్మెంట్ కార్డ్స్ , ప్రీస్కూల్ కిట్ గురించి వివరించారు. ప్రీస్కూల్ ద్వారా పిల్లల్లో శారీరక , మేధో, మానసిక, భాష, పూర్వ లిఖిత, పూర్వ పఠన అభివృద్ధిల గురించి తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. కిచెన్ గార్డెన్ లో ఆకుకూరలు, కూరగాయ మొక్కలను నాటారు. తల్లిదండ్రులు చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ, అంగన్‌వాడీ సూపర్వైజర్ సబిత, గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమార్, ప్రైమరీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు అంగన్‌వాడీ టీచర్ విజయ, రాధిక, ఏఎల్ఎంఎసీ సభ్యులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఎల్బీనగర్‌లో..

ఎల్బీనగర్, జూన్ 13: 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమంలోభాగంగా 8వ రోజు 'సామూహిక అక్షరాభ్యాసం' కార్యక్రమాన్ని మోహన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజేంద్ర సింగ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సునీత, అరుణ, జ్యోతి, సంధ్య, అంజనాదేవి, శైలజ పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గాదేవి దేవాలయ వార్షికోత్సవాలు



దుర్గాదేవి దేవాలయ వార్షిక మహోత్సవాలకు హాజరై పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 13: నాగోల్ డివిజన్ పరిధి శ్రీ సాయినగర్ కాలనీలోని దుర్గాదేవి దేవాలయం 20వ వార్షిక మహోత్సవాలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్షిక మహోత్సవాలను పురస్కరించుకొని ఉదయం ఆలయంలో అమ్మవారికి పంచామృత పలరస అభిషేకాలు, దుర్గాదేవి చతుష్షష్టి ఉపచార పూజ, పురుష సూక్త, శ్రీ సూక్త, దుర్గా సూక్త, మూల మంత్ర హవనములు, బలి ప్రదానము, పూర్ణాహుతి, సువాసిని పూజ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు చల్లా బాలమురళీ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, హనుమంతరావు, రమేష్, రవి, మురళి, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య,. కేశవులు, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు ఎస్సైలు బదిలీ

మలక్ పేట, జూన్ 13: మలక్ పేట లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ల నుంచి ఆరుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. మలక్ పేట లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై పోతుల నవీన్ బదిలీపై చార్మినార్ పీఎస్‌కు వెళ్లగా, ఎస్సై చలికంటి సురేష్ గుడిమల్కాపూర్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఎం. తేజ్యా నాయక్ బదిలీపై మలక్‌పేట పీఎస్‌కు రాగా, మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై సీహెచ్. రామస్వామి సీసీఎస్ డీడీ కి బదిలీ అవ్వగా, ఆయన స్థానంలో బహదూర్ పురా పీఎస్ నుంచి గుగ్గిల నర్మద వచ్చారు. అదేవిధంగా చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సైలు బోయ శ్రీనివాస్ బంజారా హిల్స్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. మహమ్మద్ ఫర్వేజ్ మోహియుద్దీన్ గాంధీనగర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ కాగా, ఎస్సై మాలోత్ తిరుపతి మారేడ్ పల్లి పీఎస్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో బోయిన్‌పల్లి పీఎస్ నుంచి ఎస్సై పోతరాజు కల్పన, ఫలక్ నుమా పీఎస్ నుంచి ఎస్సై బొల్లం కృష్ణారెడ్డి బదిలీపై చాదర్ ఘాట్ పీఎస్‌కు వచ్చారు.

# బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి: యశోద

బడంగ్ పేట్, జూన్ 13: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటాపాటలతో నాణ్యమైన విద్యనందించడానికి కృషి చేస్తున్నామని అంగన్‌వాడీ టీచర్ బి.యశోద తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ పిల్లలను ప్రైమరీ స్కూల్లో జాయిన్ చేసి అక్షరాభ్యాసం చేయించారు. మొక్కలు నాటించి మొక్కల ప్రాధాన్యత గురించి పిల్లలకు వివరించారు. పిల్లలు ఎత్తు, బరువులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆరోగ్యంగా ఉండే విధంగా చొరవ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. నెలకు రెండుసార్లు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు బాలామృతం, గుడ్లు అందిస్తామన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు భోజనం అందించడం జరుగుతుందన్నారు. గర్భిణిలు, బాలింతలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భిణిలు, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రబోస్‌నగర్ కాలనీలో పిల్లలను బడిలో చేర్పించాలని ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్ యశోద, తదితరులు




## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 13: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్ ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మున్సిపాల్ సీ– క్వార్టర్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11కేవీ సంహిత డిగ్రీ కాలేజీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు, 11కేవీ ఎంసీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10:30 గంటల వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**బడంగ్ పేట్‌లో..**

బడంగ్ పేట్, జూన్ 13: లెనిన్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలో9 గంటల నుంచి 12 గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగిరెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. రామిడి హిల్స్, బీఆర్ఆర్ కాలనీ, విశాఖ నగర్, సీఎంఆర్ కాలనీ, సీవైఆర్ కాలనీ, ఎస్ ఎస్ రెడ్డి కాలనీ, ఆర్జీకే కాలనీ, శ్రీ మారుతీ నగర్, వసంత్ విహార్, సప్తగిరి కాలనీ, చంద్ర విహార్ కాలనీ, మారుతీ నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. 11 కేవీ శివ సాయి నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ పేర్కొన్నారు. లక్ష్మీ నగర్, ఇందిరమ్మ హౌసెస్, ఎమ్మా ఆర్ ఆర్ కాలనీ, వినాయక్ నగర్, యాదాద్రి కాలనీ, రోమా పేస్ 1, బీరప్ప కాలనీ, వైష్ణవి కాలనీ, శివసాయి నగర్, పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్, మాతృశ్రీ ఎన్‌క్లేవ్ కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. మరమ్మతులు అయిపోయిన వెంటనే యథావిధిగా విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు

# అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

మలక్ పేట, జూన్ 13: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్ ఎస్బీఐ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... బీజేపీ మూఆసారాంబాగ్ డివిజన్ సీనియర్ నాయకుడు రాము యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్బీఐ కాలనీలోని ఓ అపార్ట్ మెంట్‌లో నివాసముంటున్నారు. గురువారం రాత్రి భోజనానంతరం కుటుంబ సభ్యులందరూ నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం ఉదయం లేచిన రాము యాదవ్ తన కుమారుడు సందీప్ యాదవ్ (35) నిద్రిస్తున్న గదిలోకి వెళ్లి చూడగా విగతజీవిలా పడి ఉండటంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎదిగిన కొడుకు కళ్లముందే విగత జీవిలా మారడంతో గుండెలవిసేలా రోధించిన ఆ తల్లిదండ్రుల తీరు, పలువురిని కంటతడి పెట్టించింది. జరిగిన సంఘటనపై రాము యాదవ్ మలక్ పేట పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పురుగుల మందు తాగి మరణించినట్లు గుర్తించారు. కాగా ఆత్మహత్య గల కారణాలను వివిధ కోణాల్లో శోధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ విఫలమా, ఆర్థిక కారణాలతోనా, లేక మరే ఇతర కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపారు. కాగా సందీప్ యాదవ్ వారి కులానికే చెందిన ఓ వివాహితను ప్రేమిస్తున్నట్లు , పెళ్లి చేసుకుందామని ఆమె వెంటపడి వేధించటంతో నాలుగు రోజుల క్రితం సదరు మహిళ మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి



రెవెన్యూ సదస్సులో వినతులను స్వీకరిస్తున్న జగదీశ్వర్ రెడ్డి

కందుకూరు, జూన్ 13 : భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడే పరిష్కరించే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు. మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో భాగంగా శుక్రవారం కొత్తూరులో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకుని, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు సదస్సులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయించుకోవాలని సూచించారు. రిజిస్టర్‌లో దరఖాస్తు దారుల పేర్లను నమోదు చేయాలని తెలిపారు. సదస్సులకు రైతులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ, భూభారతి చట్టం పై రైతులకు అవగాహన ఉండాలని తెలిపారు. అందుకోసమే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. తహసీల్దార్ గోపాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, ఆర్ఐ శ్రీకాంత్, జగన్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయుష్‌లో యోగా సాధన



సైదాబాద్, జూన్ 13: నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ రీసెర్చ్‌లో ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా' యోగా సాధన చేశామని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ తెలిపారు. యోగాపై ప్రజలలో అవగాహన, భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో టిప్పర్ బోల్తా..

## డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

బడంగ్ పేట్, జూన్ 13: మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో డివైడర్‌ను ఢీ కొట్టి టిప్పర్ బోల్తా పడింది. రాత్రి సమయం కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. టిప్పర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. జేసీబీ సహాయంతో టిప్పర్‌ను అక్కడి నుంచి తొలగించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## దివ్యాంగుల ఉపకరణాలపై 40 శాతం తగ్గించడం హర్షణీయం



దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను సన్మానిస్తున్న ఎన్‌పీఆర్‌డీ ఇండియా, స్పైనల్ కార్డ్ ఇంజురీ సంఘం, తదితర సంఘాల నాయకులు

మలక్‌పేట, జూన్ 13: దివ్యాంగులకు ఉచితంగా అందించే సహాయ ఉపకరణాలపై ప్రభుత్వం 40 శాతం తగ్గిస్తూ జీవో నెంబర్ జారీ చేయటం, దివ్యాంగులని దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే కల్యాణ లక్ష్మి తో పాటు అదనంగా మరో లక్ష రూపాయలు ప్రోత్సాహకంగా ఇస్తూ జీవో జారీ చేయడం హర్షణీయమని ఎన్.పి.ఆర్.డి ఇండియా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ అన్నారు. మలక్ పేటనల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ ఇండియా, స్పైనల్ కార్డ్ ఇంజురీ, మరో 10 దివ్యాంగుల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చాలా బాగున్నాయన్నారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో సైతం ఐదు శాతం కేటాయించడం చాలా హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్పైనల్ కార్డ్ ఇంజురీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షఫీ మాట్లాడుతూ, చైర్మన్ వీరయ్య దివ్యాంగులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా దివ్యాంగుల సమాజానికి మేలు చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

**ఉచితంగా సహాయ ఉపకరణాలు అందుతాయి**

ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం పట్ల చాలా చిత్తశుద్ధితో ఉందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. దివ్యాంగులు అంగవైకల్యంతో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటారో, ఒక దివ్యాంగుడిగా బాగా తెలుసునని, దివ్యాంగుల సమస్యలను అర్థం చేసుకొని వారి అపరిష్కృత సమస్యలన్నింటినీ పరిష్కరించి, వారు మెరుగైన జీవితం గడిపేలా, ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు వారికి అందేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో దివ్యాంగులకు ఉచితంగా అందించే సహాయ ఉపకరణాల వైకల్యం శాతం 70% ఉండగా, దాన్ని 40 శాతానికి తగ్గించి, దివ్యాంగులందరికీ ఉచితంగా సహాయ ఉపకరణాలు అందేలా చేసినట్లు ఆయన తెలిపారు. దివ్యాంగులకు అందించే 12 రకాల సహాయ ఉపకరణాలు 40% వైకల్యం ఉన్న దివ్యాంగులందరికీ అందుతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ ఇండియారాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి, సభ్యులు వి.రాజశేఖర్, అడ్డా రాజు, ప్రవీణ, విజయసింహారెడ్డి, మధు, రవి, జెర్రీ పోతుల నరసింహ, గంగారెడ్డి, భాస్కరాచారితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన దివ్యాంగులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బడంగ్ పేట్, జూన్ 13: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సరస్వతి ప్రజలకు సూచించారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, కలరా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పారిశుధ్యం లోపిస్తే అనేక రకాల వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇళ్ల ఉన్న వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఖాళీ డబ్బులు, కొబ్బరి బొండాలు, పనికి రాని వస్తువులలో వర్షం నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యాంసుందర్, మేనేజర్ నాగేశ్వరరావు, ఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, డి. వెంకన్న పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో...

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓం సాయి నగర్, సర్వోదయ కాలనీలో తడి, పొడి చెత్త పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హానికరమైన చెత్తను రోడ్లపై వేయకుండా చూసుకోవాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. జేసీబీల సహాయంతో వరద కాలువలలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. మ్యాన్‌హోల్స్‌లను క్లీన్ చేయించి రోడ్లపై చెత్తవేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు




వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగం హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఎల్బీనగర్, జూన్ 13: దిల్ సుఖ్‌నగర్ గడ్డి అన్నారం క్షేత్రంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్టాపన, గరుడ ఇష్ట హోమం, ధ్వజారోహణం, సౌందర్య లహరి పారాయణం, మూల మంత్ర హోమం, తీర్థ ప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లింగారెడ్డి, వూర నర్సింహ గుప్తా, వక్కలంక శ్రీనివాసరావు, బచ్చు సత్యనారాయణ, కుమార స్వామి, పాల్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎలైట్ హిల్స్ అపార్ట్ మెంట్ వాసులపై దాడి కేసులో

# నలుగురి రిమాండ్.. బిల్డర్ పరార్

మలక్ పేట, జూన్ 13: ఆస్మాన్ ఘడ్‌లోని ఎలైట్ హిల్స్ అపార్ట్ మెంట్ కామన్ ఏరియాలో బిల్డర్ మసీయుద్దీన్ ఖాన్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అపార్ట్మెంట్ వాసులపై బిల్డర్, అతడి అనుచరులు కలిసి దాడి చేసిన కేసులో మలక్ పేట పోలీసులు నలుగురిని(ఖలీల్, ఇషాక్, హర్షద్, జావేద్) అరెస్టు చేశారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మలక్ పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపారు.

దాడికి అసలు సూత్రధారి అయిన బిల్డర్ మసీయుద్దీన్ ఖాన్ పరార్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు.

## బ్రహ్మానందంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సైదాబాద్, జూన్ 13:ఆస్మాన్ ఘడ్ వెంకటాద్రి నగర్ రాక్ హిల్స్ లోని ఎలైట్ హిల్స్అపార్ట్మెంట్ లో పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అపార్ట్మెంట్ నివాసి బ్రహ్మానందంపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సైదాబాద్‌లోని సాయి నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న బ్రహ్మానందంను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ నిర్మాణాలను ప్రశ్నించినందుకు అపార్ట్మెంట్ బిల్డర్‌కు మద్దతుగా మజ్లీస్ పార్టీకి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేయడం దారుణమన్నారు. పాతబస్తీలో రోజురోజుకు ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పటికైనా వాటికి స్వస్తి చెప్పాలని లేకుంటే, తాము కూడా అదే స్థాయిలో స్పందించాల్సి వస్తుందని ఆయన అన్నారు. బ్రహ్మానందాన్ని పరామర్శించిన వారిలో సైదాబాద్, ఐ ఎస్ డివిజన్ల కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, జంగం శ్వేత, కాసం వెంకటేశ్వర్లు, వీరేంద్ర యాదవ్, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, రవీందర్ రెడ్డి, జంగం మధుకర్ రెడ్డి, గంగిశెట్టి రాజేష్, నవీన్, తదితరులు ఉన్నారు.

## ఉద్యమ కళాకారుల సమస్యలను పరిష్కరించాలి



కందుకూరు జూన్ 13: ఉద్యమ కళాకారుల సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా ఉద్యమ కళాకారుల నాయకుడు మస్కు మహేష్ కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కోరుతూ ఉద్యమ గాయకులు నేర్నాల కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించబోయే '12 గంటల పాటల పల్లకి'లో కార్యక్రమాన్ని కరీంనగర్ కళాభారతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివిధ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన అనంతరం మండల కేంద్రంలో మాట్లాడుతూ, కళాకారులను ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నిజమైన కళాకారులకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే '12 గంటల పాటల పల్లకి' కార్యక్రమానికి ఉద్యమకారులు, మేధావులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మన్సూరాబాద్, జూన్ 13: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. నాలుగు రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు ప్రబోధకి, నిత్య హోమం, మహా పూర్ణాహుతి, నవ కలశ స్నాపనం, చక్రతీర్థం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సంతోషి కుమారి, సభ్యులు మోహన్ రెడ్డి, రవికుమార్, జీకే గుప్తా, నాగరాజు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.